మూసీ నిర్వాసితులకు అండగా బీజేపీ

- కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా



బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన యాదిరెడ్డిని పరామర్శిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులకు బీజేపీ అండగా ఉంటుందని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా భరోసానిచ్చారు. మూసీనది ప్రక్షాళన పేరిట తన ఇల్లు కూలగొడతారన్న దిగులుతో బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై ఆసుపత్రిలో చేరి, సోమవారం డిశ్చార్జ్ అయిన చైతన్యపురి డివిజన్ వినాయకనగర్ కాలనీకి చెందిన యాదిరెడ్డిని మంగళవారం కార్పొరేటర్ పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీనేతలు కోట శ్రీదేవి, శ్రీనివాస్, కృష్ణ, ఉపేందర్, జంగారెడ్డి, కాలనీకార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు

వనస్థలిపురం అభివృద్ధికి కృషి చేయండి: బీజేపీ

వనస్థలిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవతో కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల వనస్థలిపురం రైతుబజార్ వద్ద తొలగించిన పూలు, పండ్ల సముదాయాల వద్ద రోడ్డు అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో నూతన రోడ్డు వేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా పలు ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు నూతి శ్రీనివాస్, నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా లక్ష తులసీ పూజ





కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ పరిధి వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో లక్ష తులసీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్త తదితరులు పాల్గొన్నారు.

- ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి



శ్రీనివాస కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

శ్రీనివాసకాలనీ సంక్షేమసంఘం నూతన కమిటీ

వనస్థలిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ మంగళవారం ఎన్నికైంది. నూతన అధ్యక్షులు ఉలిపే చిత్తరంజన్, ప్రధానకార్యదర్శి మందాడి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొమ్మగాని సైదుల, కందుల అరుణ, కోశాధికారి భూక్యా రామానాయక్, సహాయ కార్యదర్శిగా తేజావత్ చరణ్ సింగ్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేముల శేఖర్, లీగల్ అడ్వైజర్ ఎస్‌వీఆర్ అమర్నాథ్, సభ్యులుగా రామపుల్లా రెడ్డి, రాంబాబు, వెంకటేశ్వర్లు, దేవయ్య ఎన్నికయ్యారు.

రేణుకా ఎల్లమ్మ దేవాలయ కమిటీ ఎన్నిక

కాలనీలోని శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నికైంది. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చప్పిడి మురళీధర్‌రావు, వైస్‌చైర్మన్‌గా సాయిశ్రవణ్, ఆలయ చైర్మన్‌గా భాస్కర్ల సత్యనారాయణ, వైస్‌చైర్మన్‌గా ఆకుల మల్లేషం, ఎస్.మాధవి, ప్రధాన కార్యదర్శిగా గుంటుపల్లి బుల్లయ్య, కోశాధికారిగా బట్టల రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా పి.శారద, వల్లవరపు సుధీర్ ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హయత్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, ట్రీకటింగ్ కారణంగా 11కేవీ మాసబ్ చెరువు ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ ఏఈ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఫీడర్ పరిధిలోసాగర్‌రెసిడెన్సీ, సాగర్‌ఎన్‌క్లేవ్, రాఘవేంద్రకాలనీ, సాయిరాంనగర్ కాలనీ, జనచైతన్య కాలనీ, సూర్య సాయినగర్ కాలనీ, గంగిరెడ్డి వెంచర్, శ్రీశ్రీ ఎన్‌క్లేవ్ కాలనీలలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మునగనూర్‌లో..

విద్యుత్ మరమ్మతులు, ట్రీకటింగ్ కారణంగా తొర్రూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మునగనూరు 11కేవీ ఫీడర్‌పరిధిలో బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని ఇంజాపూర్ సబ్‌స్టేషన్ ఏఈ రాములు తెలిపారు. ఫీడర్ పరిధిలో బ్యాంక్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, రామానుజనగర్, మల్లికార్జుననగర్, యాదాద్రినగర్, ఆదర్శనగర్, వడ్డెర బస్తీ, ప్రగతినగర్, శనీశ్వర టెంపుల్ ఏరియా, అంజనాద్రి, మునగనూర్ వార్డు ఆఫీస్ ఏరియా, గణేష్‌నగర్, శివసాయిరాంనగర్ కాలనీలలో విద్యుత్ ఉండదని ఏఈ పేర్కొన్నారు

టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో..

సంతోష్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ సిరినగర్, వాసవికాలనీ, మన్సురాబాద్, గణేష్‌నగర్, గణేష్‌పురి, విశాలాంధ్ర, గంగహాస్పటల్, శ్రీనివాసకాలనీ, భగత్‌సింగ్‌నగర్, శివపార్వతి ఫీడర్ల పరిధుల్లో చెట్ల కొమ్మల కొట్టివేత, నిర్వహణపనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. 11కేవీ సిరినగర్, వాసవికాలనీ, మన్సురాబాద్, గణేష్‌నగర్, ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి హద్యాహ్నం 1 వరకు, 11కేవీ గణేష్‌పురి, విశాలాంధ్ర ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, 11కేవీ గంగహాస్పటల్, శ్రీనివాసకాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు, 11 కేవీ భగత్‌సింగ్‌నగర్, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

ఇరుకు రోడ్లపై షెడ్లు..!

- ● మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో పెరిగిపోతున్న నిర్మాణాలు
- ● పట్టించుకోని అధికారగణం



ఇళ్ల ముందు వాహనాల కోసం షెడ్లు ఏర్పాటు చేసుకున్న స్థానికులు

సరూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లోని అంతర్గత రహదారులు ఉండేదే 25-30 అడుగుల వెడల్పు.. సదరు దారుల్లో వాహనాలు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సిందే.. అలాంటి రోడ్లపై ఇళ్ల ముందు వాహనదారులు(ఇంటి యజమానులు) నిర్మించుకుంటున్న పార్కింగ్ షెడ్లు మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. అయినా మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కాలనీల అంతర్గత రోడ్లలో వాహనాల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ల పరిధిలోని దాదాపు అన్ని కాలనీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

ర్యాంపులు.. వాటి పక్కనే షెడ్లు

అనేక మంది ఇళ్ల యజమానులు ఇంటి నిర్మాణం సమయంలో సెట్‌బ్యాక్ వదలకుండా పనిపూర్తి కానిచ్చేస్తున్నారు. అనంతరం ఇంటి ముందు ఐదారు అడుగుల మేర రోడ్డును ఆక్రమించి ర్యాంపులు నిర్మించుకుంటున్నారు. సదరు ర్యాంపులను ఆసరాగా తీసుకుని వాటి పక్కనే తమ సొంత వాహనాల పార్కింగ్ కోసం అక్రమంగా షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దాంతో రోడ్డుకిరుపక్కలా సుమారు 10-12 అడుగుల దాకా ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. ఫలితంగా 25 అడుగుల రోడ్డు కాస్తా 13 అడుగులకు తగ్గిపోతోంది. 30అడుగుల వెడల్పు ఉన్న చోట 15 అడుగుల రోడ్డు మిగులుతోంది. ఇంటి నిర్మాణం సమయంలోనే ర్యాంపుల నిర్మాణాన్ని అధికారులు అడ్డుకుంటే.. వాటి పక్కన అక్రమంగా షెడ్లు ఏర్పాటయ్యేందుకు ఆస్కారమే ఉండదు. అయితే బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ దిశగా దృష్టి పెట్టడం లేదు. దీంతో ఆయా కార్పొరేషన్ల పరిధుల్లోని అనేక కాలనీల్లో అంతర్గతరోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. తమ కాలనీలోని రోడ్డుపై షెడ్ల నిర్మాణం కారణంగా తాము సాఫీగా వెళ్లలేక పోతున్నామని మీర్‌పేట్‌లోని ప్రశాంతిహిల్స్ ఫేజ్-2, నందిహిల్స్ తదితర కాలనీలవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ర్యాంపులు, షెడ్ల నిర్మాణాలను అడ్డుకుని అంతర్గత రోడ్లను వాహనాల రాకపోకలకు అనువుగా మార్చాలని వారు కోరుతున్నారు.

ఆర్టీసీ పోర్టర్ల సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర పర్యటన



రాష్ట్ర పర్యటనకు బయల్దేరిన పోర్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు

చాదర్‌ఘాట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో పార్శిల్, లాజిస్టిక్‌లో పనిచేస్తున్న పోర్టర్ల సమస్య పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ పోర్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి తెలంగాణ రాష్ట్ర పర్యటన నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మారుతి తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర పోర్టర్ల రాష్ట్ర పర్యటన మంగళవారం నల్గొండ బస్టాండ్‌ను చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్గో పార్శిల్, లాజిస్టిక్‌లో రౌండ్ ది క్లాక్‌గా పనిచేస్తున్న పోర్టర్లను అసోసియేషన్ ప్రతినిధులు బృందం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు సేకరించినట్లు అధ్యక్షుడు మారుతి వివరించారు. పోర్టర్ల సమస్యలను, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చేపట్టే చర్యల కోసమే తాము తెలంగాణ రాష్ట్ర పర్యటన నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు భాస్కర్, జన్ను, నర్సింహ, శంకర్ శివమూర్తి, అంజయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



డిఫెన్స్‌కాలనీలో సీసీరహదారిని ప్రారంభిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని డిఫెన్స్‌కాలనీలో మంగళవారం జీహెచ్‌ఎంసీ నిధులు రూ.36లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రహదారిని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఫ్లైఓవర్లు, స్కై ఓవర్లు, అండర్‌పాస్‌లు, నాలాలు, యూజీడీ, బీటీ, సీసీ రహదారులు, కమ్యూనిటీహాల్స్, పార్కులు, శ్మశానవాటికలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం డిఫెన్స్‌కాలనీలో రూ.85లక్షలతో చేపట్టిన అసంపూర్తి కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. డిఫెన్స్‌కాలనీ, మాధవనగర్‌కాలనీలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్స్ నిర్మాణాలను పూర్తిచేసేందుకు మరో రూ.1.5కోట్లు అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకసురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకట్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, హనుమాన్ ఆలయ మాజీ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సదానందరెడ్డి, చీర శ్రీనివాస్, చేగోని మల్లేష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు బాల్‌రాజ్, రాము, రవీందర్‌రెడ్డి, టి.కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైవిరెడ్డి, నాయకులు రోజారెడ్డి, వసంత, రమాదేవి, బొంబాయి, యాదగిరి, మహేష్, ప్రభాకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేను ఆకస్మిక తనిఖీ చేసిన జెడ్సీ



కొత్తపేట ప్రజయ్ నివాస్‌లో సర్వే తీరును తనిఖీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్

ఎల్బీనగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) కొనసాగుతున్న తీరును జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్‌కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట ప్రజయ్ నివాస్‌లో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఇంతలో జోనల్ కమిషనర్ అకస్మికంగా అక్కడికి చేరుకుని సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జోనల్ కమిషనర్ సర్కిల్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతున్న తీరుపై సమీక్షించారు. సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ఇళ్ల జాబితా రూపొందించి స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తయ్యిందా? ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్లు డాక్టర్ తిప్పర్తి యాదయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి వేగవంతం

- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి వేగవంతంగా జరుగుతున్నదని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ 32వ డివిజన్‌లోని సీతాహోమ్స్‌లో కొత్తగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం కార్పొరేటర్ గౌర రమాదేవిశ్రీనివాస్‌తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గట్టు బాలకృష్ణ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయకహిల్స్‌లో..

అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ ఫేజ్-1 కాలనీలో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డితో కలిసి మేయర్ పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తుండడంతో సమస్యలు సైతం పెరిగిపోతున్నాయని, ఆయా సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ తరఫున శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ జ్యోతీరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రావేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సాయిసంస్థాన్ ట్రస్ట్ అడ్వైజరీ కమిటీ ప్రమాణ స్వీకారం

చైర్మన్‌గా వనం యాదయ్య



అడ్వైజరీ కమిటీ చైర్మన్ వనం యాదయ్య, సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ శ్రీషిర్డీసాయి సంస్థాన్ ట్రస్ట్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా వనం యాదయ్యతో పాటు మరో ఆరుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న అడ్వైజరీ కమిటీ సభ్యులు సోమవారం రాత్రి సాయి సంస్థాన్ ఆవరణలో బాధ్యతలు స్వీకరించారు. అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా వనం యాదయ్య, సభ్యులుగా కొలిశెట్టి లక్ష్మయ్య, గుండా మల్లయ్య, బచ్చు గంగాధర్, ఎ.నరసింహారావు, వనం రంగయ్య, డాక్టర్ కె.లింగయ్య నియామకవగా, గుండా మల్లయ్య మినహా మిగతా ఆరుగురు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన కమిటీ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా అడ్వైజరీ కమిటీ చైర్మన్ వనం యాదయ్య మాట్లాడుతూ కమిటీ సభ్యులందరి సహాయ సహకారాలతో సంస్థాన్ అభివృద్ధి కోసం పాటుపడడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ బీవీ శ్యామ్‌కుమార్, వైస్ చైర్మన్‌లు శంకర్‌రావు, వీరప్ప, ప్రధానకార్యదర్శి రఘుకుమార్, సంయుక్త కార్యదర్శులు రాజశేఖర్, కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పద్మాకర్ ఆత్రేయ, ఎం.శ్యామలారావు, కృష్ణవేణి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి



కౌన్సిలర్ మంగమ్మ శివకుమార్ ఇంట్లో సర్వే వివరాలను సేకరిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే తుర్కయంజాల్ మున్సిపాలిటీలో కొనసాగుతోంది. బుధవారం 21వ వార్డులో చేపట్టిన సర్వేలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ కందుల అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ కుటుంబం నుంచి సర్వే వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 24 వార్డులలో సర్వే పనులు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. మున్సిపాలిటీలో 24,551 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. 194 మంది ఎన్యూమరేటర్‌లు, 20 సూపర్ వైజర్‌లు సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని తెలిపారు.

సర్వేను పరిశీలించిన నోడల్ అధికారి



డివిజన్‌లో సర్వేను పరిశీలిస్తున్న నోడల్ అధికారి పంకజ తదితరులు

మన్సూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సర్కిల్ మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మంగళవారం అడిషనల్ కమిషనర్ హెల్త్, సర్కిల్ నోడల్ అధికారి పంకజ పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని రాగాల ఎన్‌క్లేవ్, సహార ఎస్టేట్స్‌లో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే వివరాలను ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వేకు సహకరించాలని ప్రజలకు ఆమె సూచించారు. సమగ్ర వివరాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాంతో పాటు అధికారులు పాల్గొన్నారు.



కొహెడాలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

కొహెడాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హయత్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కొహెడా గ్రామంలో జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వారు బుధవారం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వర ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్‌చైర్మన్ కొత్త రాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, జక్క కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్

తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల రామగిరి గుట్ట సర్వే నంబర్ 137 ప్రభుత్వ భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని గ్రామానికి చెందిన మోడెపు సత్యనారాయణగౌడ్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన మోడెపు శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వి అమ్ముకున్నాడని తెలిపారు. దీంతోపాటు రామగిరిగుట్టపై ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహ శిలాఫలకంతోపాటు హనుమాన్ చాలీసా శిలాఫలకం ధ్వంసం చేశాడని చెప్పారు. శిలాఫలకం ధ్వంసం చేసి 5 రోజులు గడుస్తున్నా ఆలయ కమిటీ పాలకవర్గం ఫిర్యాదు చేయకపోవడం విడ్డురంగా ఉందన్నారు. శ్రీనివాస్‌గౌడ్‌పై వనస్థలిపురం, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కేసులు ఉన్నాయని.. ఇటీవలే జైలు నుంచి అతడు బెయిల్‌పై వచ్చాడని తెలిపారు. ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేసిన అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు



సైదులు(ఫైల్)

హయత్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 20 రోజులుగా తన భర్త కనిపించడం లేదని ఓ గృహిణి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్ డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీ ఫేజ్-2లో జంపాల నాగలక్ష్మి భర్త సైదులు కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. సైదులు(40) హెయిర్ కటింగ్ షాపులో పనిచేస్తాడు. 20రోజుల క్రితం పని ఉందని ఇంట్లో చెప్పి ఉదయం 7 గంటలకు బయటకు వెళ్లాడు. తిరిగిరాలేదని ఫిర్యాదు చేసింది. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని, తన భర్తను తనకు అప్పగించాలని పోలీసులను కోరింది. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెకోలేకర్ లక్ష్మి

ఓల్డ్ మలక్ పేట, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెకోలేకర్ లక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్‌చైర్మన్‌గా యాకుత్‌పురాకు చెందిన కోట్ల శ్రీనివాస్‌ను నియమించింది. మార్కెట్ కమిటీ డైరెక్టర్లను బుధ, గురువారాల్లో ప్రకటించే అవకాశాలున్నాయి. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కొన్ని రోజులుగా పలువురు ఆశావహులు గట్టి ప్రయత్నం చేశారు. చివరకు టీపీసీసీ జనరల్ సెక్రటరీగా ఉన్న చెకోలేకర్ శ్రీనివాస్ సతీమణిని చైర్మన్ పదవి వరించింది.